
ధ్వజారోహణంతో మొదలైన సాలకట్ల బ్రహ్మోత్సవాలు

శ్రీవారికి సీఎం చంద్రబాబు పట్టువస్త్రాల సమర్పణ

పెద్దశేషుడిపై మాడవీధుల్లో స్వామి విహారం

కళాబృందాల ఆటపాటలతో అంబరాన్నంటిన సంబరాలు



బంగారు ధ్వజస్తంభం మీద గరుడపతాకం రెపరెపలాడింది. ముక్కోటి దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ గరుడుడు ప్రకటన చేశాడు. మంగళవాయిద్యాల నడుమ, వేదగానాల మధ్య శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణం వైభవంగా సాగింది. ఆ తర్వాత ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీసమేతంగా సంప్రదాయబద్ధంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పెద్దశేష వాహనసేవలో పాల్గొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచీ వచ్చిన 14 బృందాలు మాడవీధుల్లో ప్రదర్శించిన కళావిన్యాసాలు భక్తులను మురిపించాయి.

ఆరంభం ఆదిదేవుని మహోత్సవం





తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో తొలిరోజైన శుక్రవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి పెద్దశేషవాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఏడుతలల స్వర్ణశేషవాహనంపై పరమపద వైకుంఠనాథుడి అలంకారంలో మాడవీధుల్లో ఊరేగారు. శ్రీవారికి ఆదిశేషుడు మిక్కిలి సన్నిహితుడు. స్వామి కొలువుదీరింది శేషాద్రి కావటంతో పాటు పానువు కూడా శేషుడే. ఆదిశేషుడు తన పడగనీడలో స్వామివారిని సేవించిన వ్యక్తి. రామావతారంలో లక్ష్మణుడిగా, ద్వాపరంలో బలరాముడిగా శ్రీమన్నారాయణుడికి శేషుడు మిక్కిలి సన్నిహితంగా ఉన్నట్లు పురాణోక్తి. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల మొదటిరోజు శేషుడికి ప్రాధాన్యమిస్తూ పెద్దశేష వాహనంపై ఊరేగటం ఆనవాయితీ. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఉత్సవర్లను వజ్ర, వైడూర్య, మరకత, మాణిక్య, పట్టుపీతాంబర వస్త్ర, సుగంధ పరిమళ పుష్పమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి 9 గంటలకు మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, కళబృందాల ప్రదర్శనలు, గోవిందనామస్మరణల నడుమ పెద్దశేషవాహనంపై శ్రీనివాసుడు దర్శనమిచ్చాడు. అంతకుముందు పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వాహన మండపంలో ఉత్సవర్లను దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు హారతి ఇచ్చి శఠగోపంతో ఆశీర్వదించారు. తొలిరోజే మాడవీధులు సాంస్కృతిక కార్యక్రమాలతో మార్మోగాయి. కోలాటాలు, డప్పువాయిద్యాలు, వివిధ దేవతామూర్తుల అలంకరణలు, చెక్కభజన బృందాలు పాల్గొన్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆగమోక్తంగా ధ్వజారోహణం

శ్రీవారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం 5.45 - 6 గంటల మధ్య మీనలగ్నంలో జరిగిన ధ్వజారోహణ ఘట్టంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి సమక్షంలో వేదగానాలు, మంగళవాయిద్యాలు మధ్య అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజపటాన్ని ఎగురవేశారు. సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ఈకార్యక్రమం నిర్వహిస్తారని ప్రాశస్త్యం. ఈ కార్యక్రమంలో జీయర్‌స్వాములు, అర్చకులు, ఆగమ సలహాదారులు, ఈవో శ్యామలరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తొలిరోజు మోస్తరుగానే రద్దీ

బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు భక్తుల రద్దీ ఓ మోస్తరుగానే కనిపించింది. రాత్రి జరిగిన పెద్దశేష వాహనంలో భక్తులు తక్కువగా ఉన్నారు. గ్యాలరీలోనూ పలుచగా కనిపించారు. సీఎం పర్యటన నేపథ్యంలోనే భక్తుల రద్దీ తక్కువగా ఉందని, పెరటాశి మాసం మూడో శనివారం కావడంతో శనివారం రద్దీ అధికంగా ఉండే అవకాశముందని టీటీడీ భావిస్తోంది.



వైభవంగా ధ్వజపటం ఊరేగింపు

శ్రీవారి బ్రహ్మోత్సవ ధ్వజారోహణం సందర్భంగా శుక్రవారం ధ్వజపటం ఊరేగింపు వైభవంగా జరిగింది. వైఖానస ఆగమం ప్రకారం శాస్త్రోక్తంగా గరుడకేతన ప్రతిష్ఠ, కంకణధారణ, ఆలయ ఆవరణంలో, బయట అష్టదిక్కుల్లో అర్చకులు బలిని వేస్తూ ఆలయం ముందుకు వచ్చారు. అర్చకుల వెనుకభాగంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి, అనంత, గరుడ, విష్వక్సేన, సుగ్రీవ, హనుమంత, ధ్వజపటాన్ని మాడవీధుల్లో ఊరేగిస్తూ సకలదేవతామూర్తులకు ఆహ్వానం పలికారు. ఊరేగింపు అనంతరం ఉత్సవ మూర్తులతో పాటు ధ్వజ పటాన్ని ఆలయంలోకి తీసుకెళ్లారు.



ధనలక్ష్మీదేవిగా అన్నపూర్ణ



తిరుపతి నగరం లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి అమ్మవారు ధనలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 5, 10, 20, 50, 100, 200, 500 రూపాయల నోట్లతో సర్వాంగసుందరంగా అలంకరించారు.

- తిరుపతి అర్బన్

టీటీడీ బోర్డు లేకుండానే బ్రహ్మోత్సవాలు

- స్పెసిఫైడ్ అథారిటీ కూడా వేయలేదు
- టీటీడీ చరిత్రలో ఇటువంటి పరిస్థితి అరుదు

తిరుపతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి పాలకమండలి లేకుండానే అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. గురువారం అంకురార్పణ, శుక్రవారం ధ్వజారోహణం కూడా జరిగాయి. కనీసం స్పెసిఫైడ్ అథారిటీ కూడా లేదు. ఇటువంటి పరిస్థితి చాలా అరుదు. పాతికేళ్ళలో 2017లో మాత్రమే శ్రీవారి బ్రహ్మోత్సవాలు పాలకమండలిగానీ, స్పెసిఫైడ్ అథారిటీగానీ లేకుండానే జరిగాయి. మళ్లీ అలాంటి పరిస్థితి ఇప్పుడు ఏర్పడింది. టీటీడీ ఏర్పాటైనప్పటి నుంచీ నిర్వహణ కోసం నిర్ణీత కాలానికి ప్రభుత్వం పాలకమండళ్ళను నియమిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. పాలక మండలి లేని సమయాల్లో దేవస్థానాలకు సంబంధించిన కీలక నిర్ణయాల కోసం ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం స్పెసిఫైడ్ అథారిటీని నియమిస్తుంది. పాలకమండలిలో అధ్యక్షుడు, సభ్యులు వుంటే స్పెసిఫైడ్ అథారిటీలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గానూ, ఈవో, జేఈవోలు సభ్యులుగా వుంటారు. కార్యనిర్వహణాధికారిని కూడా ప్రభుత్వమే నియమిస్తున్నప్పటికీ ఆ అధికారికి పరిమిత అధికారాలు మాత్రమే వుంటాయి. పరిపాలనాపరంగా సాధారణ నిర్ణయాలను మాత్రమే ఈవో తీసుకోగలరు. కీలక అంశాలపై పాలకమండలిలోనే చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు. టీటీడీ ఏటా ఎన్నో ఉత్సవాలు, వేడుకలు నిర్వహిస్తుంటుంది.తిరుమలలోనే కాకుండా దేశవ్యాప్తంగా వున్న అనుబంధ ఆలయాల్లో కూడా వీటిని చేపడుతుంటుంది. అయితే అవన్నీ ఒకెత్తు అయితే శ్రీవారి బ్రహ్మోత్సవాలు మరొక ఎత్తు. ఈ ఉత్సవాలకు ఉన్న ప్రాధాన్యత,ప్రాచీనత మరే ఉత్సవానికీ ఉండదు. అయినా ఈసారి పాలకమండలి లేకుండానే బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాలకు ముందే టీటీడీ పాలకమండలిని ప్రకటిస్తారనే ప్రచారం జరిగింది. పలు పేర్లు కూడా ఊహాగానాల్లో తిరిగాయి. టీటీడీ చైర్మన్ పదవికి, మంత్రి పదవికి కూడా లేనంత పోటీ ఉంటుంది. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు అవుతున్నా పాలకమండలిని నియమించకపోవడం మీద రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది.

మానవాళికి ఉపయోగపడేలా ఇస్రో ప్రయోగాలు

- అంతరిక్ష వారోత్సవాల ప్రారంభంలో షార్ డైరెక్టర్ రాజరాజన్



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న షార్ డైరెక్టర్ తదితరులు

సూళ్లూరుపేట, అక్టోబరు 4: మానవాళికి ఉపయోగపడే ప్రయోగాలను ఇస్రో చేపడుతోందని, సాంకేతిక జ్ఞానాన్నీ అందిస్తుందని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను షార్‌లోని ఎంఆర్ కురుప్ ఆడిటోరియంలో శుక్రవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్ 1 వంటి భారీ ప్రయోగాల విజయంతో మరిన్ని ప్రయోగాత్మక ప్రయోగాలకు మనో ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. రాబోయే 15 సంవత్సరాల్లో ఇస్రో ఏడాదికి 25 ప్రయోగాలు చేపట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు. అంతరిక్షంలో చేపట్టే ప్రయోగాలు, ఉపగ్రహాలు వాటి ఉపయోగాల గురించి విద్యార్థిదశ నుంచే తెలియజేసేందుకు ఏటా ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఇస్రో నిర్వహిస్తుందన్నారు. పుదుచ్చేరి టెక్నాలజికల్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఎస్.మోహన్ మాట్లాడుతూ దేశం గర్వించతగ్గ చంద్రయాన్-3 వంటి విజయాన్ని అందించిన షార్ సెంటర్‌ను సందర్శించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇస్రో చేపట్టే రాకెట్ ప్రయోగాల్లో బుల్లి ఉపగ్రహాలను పంపించేందుకు విద్యార్థులకు అవకాశం ఇవ్వడం మంచిదన్నారు. అనంతరం వారోత్సవాలకు సంబంధించిన వీడియోను విడుదల చేశారు. ఇస్రో చేపట్టే ప్రయోగాలు, ఉపగ్రహాలు వాటి ఉపయోగాలు తదితర వాటికి సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. షార్ అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ హమీద్, కంట్రోలర్ ఎం.శ్రీనివాసులు రెడ్డి, గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్ స్పెషలాఫీసర్ అవుట్

- జయచంద్రారెడ్డిని తొలగిస్తూ టీటీడీ నిర్ణయం
- వైసీపీ హయాంలో అర్హత లేకున్నా అందలం
- వైవీ సుబ్బారెడ్డి బంధువు కావడమే ఆయన అర్హత
- టీటీడీ సొమ్ముతో లక్షల్లో వేతనం, రాజభోగం
- పాలన మారాక ఎట్టకేలకు చర్యలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో అర్హతలేకపోయినా అగ్రపీఠమేసి స్విమ్స్‌కు అనుబంధంగా ఉన్న శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ(ఎస్‌బీఐఏ) స్పెషలాఫీసర్ డాక్టర్ ఎం.జయచంద్రా రెడ్డిపై ఎట్టకేలకు వేటు పడింది. టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశాల మేరకు ఆయన్ను స్పెషలాఫీసర్ విధులనుంచి తప్పిస్తూ డైరెక్టర్ ఆర్వీ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ నరేంద్రకు బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సంబంధిత విభాగాల నుంచి నోడ్యూస్ సర్టిఫికెట్ కూడా జయచంద్రారెడ్డి అందజేయాలని, వాహనం ఇతరత్రా సదుపాయాలన్నీ స్వాధీనం చేసుకోవాలని ఉత్వర్వులో పేర్కొన్నారు. టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ కీలక నేత వైవీ సుబ్బారెడ్డికి సమీప బంధువు అయిన డాక్టర్ జయచంద్రా రెడ్డి స్విమ్స్‌లో ఎంసీహెచ్ (సర్జికల్ ఆంకాలజీ)కోర్సు ఉత్తీర్ణత చెంది వారం రోజులు తిరగకముందే ఎస్‌బీఐఏను ఏర్పాటు చేసి స్పెషలాఫీసర్‌గా నియమిస్తూ, లక్షల్లో వేతనం, కారు, క్వార్టర్స్, ఛాంబర్..ఇలా వెంటవెంటనే కేటాయించారు. నిబంధనలను గాలికొదిలేసి నియామకం చేపట్టిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈనేపథ్యంలో గత నెల 18న 'అర్హత లేకున్నా అందలం' అంటూ ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై విచారణ చేపట్టిన టీటీడీ ఈవో అక్టోబరు 1న ఆయనకు నోటీసులు అందజేశారు. ఆయన దగ్గరనుంచి సరైన సమాధానం లేకపోవడంతో తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.



జయచంద్రారెడ్డి

తొలగించారు సరే విచారణ సంగతేంటి?

ఎస్‌బీఐఏ స్పెషలాఫీసరుగా నియామకమైన జయచంద్రా రెడ్డి.. మెల్లమెల్లగా స్విమ్స్‌కే స్పెషలాఫీసర్‌గా మారిపోయారు. ఆంకాలజీ అనుబంధ విభాగాలతో పాటు పాథాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ విభాగాలకు సంబంధించిన పరికరాల కొనుగోలు, సిబ్బంది నియామకాలు, స్విమ్స్-టీటీడీకి లైజన్ ఆఫీసర్ బాధ్యతలు కూడా ఆయనకే అప్పగించారు. స్విమ్స్‌లో 15 మందికి పైగా సీనియర్ ప్రొఫెసర్ల నేతృత్వంలోని మెడికల్, సర్జికల్, రేడియేషన్ ఆంకాలజీ, రేడియాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ వంటి అనేక విభాగాలను తన అధీనంలోకి తెచ్చుకున్నారు. పలు విభాగాధిపతుల ఫైళ్లను ప్రత్యేకాధికారి ద్వారా రూట్ చేయాలని ఆదేశాలిచ్చారు. స్విమ్స్ శాఖల సాధారణ పనితీరులో జోక్యం చేసుకోవడమే కాకుండా స్విమ్స్ హైపవర్ సహా పలు కమిటీల్లో ఆయన పేరు ఉండాల్సిందే. పాత స్విమ్స్ భవనం పునరుద్ధరణ, న్యూరో అండ్ కార్డియో సైన్సెస్ బ్లాక్ నిర్మాణం, శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ కోసం పరికరాలు కొనుగోలు, మెడికల్ ఆఫీసర్లు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది, డ్రైవర్ల నియామకంలో ఇతడి ప్రమేయం ఎక్కువగా ఉందని, తద్వారా నిధుల దారిమళ్లింపులు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా ఖరీదైన పరికాల కొనుగోలులోనూ ఆయన ప్రమేయం ఉందని, వాటిపైనా దర్యాప్తు చేయాలని పలువురు కోరుతున్నారు. జయచంద్రారెడ్డిని స్పెషలాఫీసర్‌గా తొలగించార సరే, అతని అక్రమాలపై విచారణ చేపట్టాల్సి ఉందని డిమాండు చేస్తున్నారు.

వెయ్ వెయ్.. మరో స్టెప్పు వెయ్



చంద్రగిరి మండలం ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో శుక్రవారం ప్రారంభమైన 'మోహన మంత్ర' కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి సరదాగా డ్యాన్సు చేస్తున్న ప్రొ.ఛాన్సలర్ విష్ణు మంచు

మండలాభివృద్ధికి కృషి చేయండి

రామచంద్రాపురం, అక్టోబరు 4: నూతన అధికారులు మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి కోరారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్య లోపం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీటీసీ డిల్లీరాణి మాట్లాడుతూ అభివృద్ధి పనులను డిసెంబరు లోగా పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో ఇందిరమ్మ మాట్లాడుతూ తాగునీటి పైపులైన్ల లీకేజీని అరికట్టి, శుద్ధజలం అందించాలన్నారు. ఏపీఎం గురుమూర్తి మాట్లాడుతూ మండలంలోని 212 మహిళా స్వయం ఉపాధి సంఘాలకు రూ.15కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు అన్వర్‌బాషా, వ్యవసాయ శాఖాధికారి స్రవంతి, ఏపీవో హంసవేణి, వైద్యాధికారిణి తేజస్విని, ఎంఈవోలు మార్కొండయ్యనాయుడు, జయవేలు. ఏఈలు గిరి, యతిరాజులు, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, మునీంద్ర, రాజేష్, కృష్ణవేణి, మంజుల, లావణ్య, కోఆప్షన్ మెంబరు రాజేంద్ర, సర్పంచులు మురగయ్య, భారతి, హిమాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి

మూలస్థానమ్మ ఆలయంలో గాయత్రీ పూజ



పాకాల, అక్టోబరు 4: మండలంలోని నేంద్రగుంట మూలస్థానమ్మ ఆలయంలో శుక్రవారం గాయత్రి పూజ నిర్వహించారు. వి.దయానంద చౌదరి దంపతుల ఆధ్వర్యంలో పూజ నిర్వహించారు. వి.మనోహర్ నాయుడు దంపతులు అన్నదానం చేశారు. పాకాల శ్రీరామ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకం చేసి, నైవేద్యం సమర్పించారు.

గాయత్రిదేవిగా తిరుపతి గంగమ్మ



భాకరాపేట, అక్టోబరు 4: చిన్నగొట్టిగల్లు చెరుకు కట్టపై వెలసిన తిరుపతి గంగమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వెలుగు ఏపీఎంగా స్వర్ణలత

భాకరాపేట, అక్టోబరు 4: చిన్నగొట్టిగల్లు మండల వెలుగు ఏపీఎంగా స్వర్ణలత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలలో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న కుమారస్వామి పీలేరు డెయిరీ ఏపీఎంగా బదిలీ కాగా సత్యవేడులో ఏపీఎంగా పనిచేస్తున్న స్వర్ణలత చిన్నగొట్టిగల్లుకు వచ్చారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పీజీ రెండో దశ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 4: ఏపీ పీజీసెట్-2024లో ర్యాంకులు పొందిన విద్యార్థులకు శుక్రవారం నుంచి 7 వ తేదీ దాకా పీజీ రెండో దశ సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నారు. ఎస్వీయూలో సీటు పొందిన విద్యార్థులు 7వ తేదీలోపు యూనివర్సిటీలోని ఎస్వీఐ భవనంపై గల అడ్మిషన్ల కార్యాలయంలో సంప్రదించాల్సి ఉంటుంది. అలాగే ఐసెట్ ర్యాంకులు పొందిన వారికి ఈ నెల 7వ తేదీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాల్సి ఉంటుంది. ఈ మేరకు వర్సిటీ అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఊకా రమేష్‌బాబు తెలిపారు.

చిన్నగొట్టిగల్లు ఎంపీడీవోగా గిడ్డయ్య

భాకరాపేట, అక్టోబరు 4: చిన్నగొట్టిగల్లు ఎంపీడీవోగా గిడ్డయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన చిన్నగొట్టిగల్లుకు వచ్చారు. కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు, టీడీపీ నాయకులు సత్కరించారు.

వైభవంగా తిరుమంజనం

రామచంద్రాపురం, అక్టోబరు 4: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాయలచెరువుకట్ట జలకంఠేశ్వరాలయంలో వెలసిన భవానీ, మహాలక్ష్మి అమ్మవార్లకు శుక్రవారం సుగంధ పరిమళ ద్రవ్యాలతో తిరుమంజనం నిర్వహించారు. విశేష పూజల అనంతరం అమ్మవార్లను గాయత్రి దేవిగా అలంకరించారు. ఉభయదాతలుగా మాజీ సర్పంచులు తిరుమలరెడ్డి, మాధవి వ్యవహరించారు. శ్రీశక్తిపీఠంలో మరకతశక్తి కాళీ అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించారు. సాయంత్రం ఊంజల్ సేవ అనంతరం కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి భక్తులకు అనుగ్రహభాషణం చేశారు.

ఆరుగురు ఎర్ర స్మగ్లర్ల అరెస్టు

21 దుంగలు, రెండు వాహనాల స్వాధీనం

మంగళం, అక్టోబరు 4 : నెల్లూరు జిల్లా ఆత్మకూరు అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు గురువారం కూంబింగ్ నిర్వహించి ఆరుగురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. 21 ఎర్రచందనం దుంగలతోపాటు రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ అల్లిబాషా బృందం ఆత్మకూరు పరిధిలోని అనంతసాగరం అడవుల్లో కూంబింగ్ చేపట్టగా కొంతమంది వాహనాల్లో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తూ కనిపించారు. చుట్టుముట్టి అక్కడున్న ఆరుగురిని అరెస్టు చేశారు. వారిలో ముగ్గురు తమిళనాడు వేలూరు జిల్లాకు చెందినవారుగా గుర్తించారు. మరో ముగ్గురు తిరుపతి జిల్లా కేవీబీపురానికి చెందినవారు. వీరినుంచి 21 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిని అరెస్టు చేసి తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం డిపోల్లో తనిఖీలు

స్టాకు వివరాలను పరిశీలించిన ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 4: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం సాయంత్రం తిరుపతిలోని మద్యం డిపోలను తనిఖీ చేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం తిరుపతికి వచ్చిన ఆయన విమానాశ్రయం నుంచి నేరుగా రేణిగుంట రోడ్డులోని మద్యం గోడౌన్‌కు చేరుకుని తనిఖీలు చేశారు. స్టాకు, సేల్స్ రిజిస్టర్లను పరిశీలించారు. మూడు నెలల కాలంలో వచ్చిన స్టాకు, అందులో బార్లు, మద్యం దుకాణాలకు సరఫరా చేసింది, ఆదాయం తదితర వివరాలను డిపో మేనేజర్ జానకిరాంను అడిగి తెలుసుకున్నారు. రోజువారీ వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అక్కడ వృథాగా ఉన్న ఫర్నిచర్‌ను అవసరమైన స్టేషన్లకు వాడుకోవాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డిని ఆదేశించారు. మద్యం టెండర్లు పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి, ఏఈఎస్ వాసుదేవ చౌదరి పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.56 కోట్లు

తిరుమల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.56 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 63,376 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,146 మంది తలనీలాలు సమర్పించారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా దినకర్



తిరుపతి(లీగల్), అక్టోబరు 4: మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా తిరుపతికి చెందిన సీనియర్ న్యాయవాది టి.దినకర్ నియమితులయ్యారు. ఈ మేరకు కమిషనర్ మౌర్య ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన అన్ని కేసులను ఆయన వాదించనున్నారు. తిరుపతి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పనిచేసి, ప్రస్తుతం టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. తన నియామకానికి సహకరించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శాప్ చైర్మన్‌కు సన్మానం



రవినాయుడును సన్మానిస్తున్న తెలుగు యువత నేతలు

తిరుచానూరు, అక్టోబరు 4: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనిమిని రవినాయుడును శుక్రవారం విజయవాడలో తెలుగు యువత జిల్లా నాయకులు సన్మానించారు. శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. సన్మానించిన వారిలో కృష్ణయాదవ్, దిలీప్‌రాయల్, కేవీకే ప్రసాద్ తదితరులున్నారు. కాగా, లిడ్‌క్యాప్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పిల్లి మాణిక్యాలరావును టీడీపీ తిరుచానూరు ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కాపునాడు సేవా సమితి జిల్లా ప్రధాన సలహాదారుడు సాయి రాయల్ సన్మానించారు.

డాక్టరేట్ ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 4: ఎస్వీయూ పాపులేషన్ స్టడీస్ - సోషియల్ వర్క్ పరిశోధకుడు వి.జనార్దనం డాక్టరేట్ పొందారు. బిహేవియర్ ప్యాట్రన్ ఆఫ్ యూత్‌అండ్‌అడ్జస్ట్‌మెంట్ టు ద సిచ్యుయేషన్-ఎ స్టడీ అమాంగ్ కాలేజీ స్టూడెంట్స్ ఆఫ్ ఏపీ అంశంపై రిటైర్డు ప్రొఫెసర్ వినాయకమూర్తి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

అధిక ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు


తిరుపతి(జీవకోన),అక్టోబరు4:శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్ హెచ్చరించారు. డీటీవో కార్యాలయంలో ఆయన శుక్రవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ సాధారణ రోజుల తరహాలోనే ఛార్జీలు వసూలు చేయాలని, అధిక మొత్తంలో వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా గమ్యస్థానానికి చేర్చేలా డ్రైవర్లు చొరవ తీసుకోవాలన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

తిరుపతి(లీగల్), అక్టోబరు 4: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 14 మందికి రూ.14వేల చొప్పున జరిమానా విధిస్తూ 4వ అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. వీరిలో రెండవసారి పట్టుబడిన వారికి రూ.15వేలు జరిమానాతో పాటు ఐదు రోజులు జైలు శిక్ష విధించారు.

కపిలతీర్థంలో నవరాత్రి వేడుకలు

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 4: స్థానిక కపిలేశ్వరాలయంలో నవరాత్రి వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు కామాక్షి, కపిలేశ్వరులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 6-7 గంటల మధ్య అమ్మవారి ఊంజలసేవ నిర్వహించారు. తొలి రోజు అమ్మవారు కామాక్షి రూపంలో భక్తులను అనుగ్రహించారు. అన్నమాచార్య ప్రాజక్టు కళాకారుల సంగీత సభ భక్తులను అలరించింది. ఆలయ ఏఈవో, అర్చకులు పాల్గొన్నారు. శనివారం అమ్మవారు ఆదిపరాశక్తి రూపంలో కనిపిస్తారు.



1985కి ముందు తిరుమల అంటే ఒక ఊరు. పాతికవేల జనాభా. ఆలయంతోనూ, యాత్రీకులతోనూ, వ్యాపారాలతోనూ కళకళలాడే జనం ఉండే ఊరు. మాడ వీధులకు అటూ ఇటూ ఒరుసుకుని ఉండే ఇళ్ల మధ్య నుంచే స్వామి ఉత్సవ యాత్రలు సాగేవి. స్థానికుల హోరతులకు ప్రాధాన్యం ఉండేది. మాడవీధులు దాటి

అనాటి సంగతులు

సూరాపురంతోట, పెరిందేవమ్మతోట, చంద్రబాబు తోట ప్రాంతాలన్నీ స్థానికుల నివాసాలుగా ఉండేవి. భక్తుల సంఖ్య పెరిగేకొద్దీ స్థానికుల ప్రాధాన్యం తగ్గింది. భద్రత ప్రాధానాంశంగా మారింది. 1985 నుంచి తిరుమల ఊరిని ఖాళీ చేయించి తిరుపతికి తరలించడం మొదలు పెట్టారు. ఇళ్లన్నీ తొలగించి మాడవీధులను విస్తరించారు. గ్యాలరీలుగా మార్చారు. ప్రస్తుతం బాలాజీనగర్ ప్రాంతానికి మాత్రమే స్థానికులు పరిమితం అయ్యారు.





తిరుమల అంటే ఒకనాడు ఊరు

- ఆంధ్రజ్యోతి, తిరుమల

వందేళ్ల కిందట...

నిజానికి వందేళ్లకు ముందు తిరుమలలో ఆలయం తప్ప ఇళ్లుండేవి కాదు. ఉదయం ఏడింటికి గుడి తలుపులు తెరిచి, సాయంత్రం ఐదింటికే మూసేసేవారు. అర్చకులు తిరుపతి నుంచే రోజూ వచ్చిపోయేవాళ్లు. అడవి జంతువుల భయం ఉండేది. యాత్రీకుల సంఖ్య కూడా చాలా తక్కువగానే ఉండేది. దీంతో కొండమీద ఊరును ఏర్పాటు చేయాలనే ఆలోచనకు హథీరాంజీ మఠం మహంత్ ప్రయాగ్ దాస్‌జీ పురుడపోశారు. 1910-20 కాలంలో కొండ మీద జనావాసాలను ఏర్పాటు చేయడానికి ఆయన పూనుకున్నారు. తిరుపతి, చంద్రగిరి, తిరుచానూరుతో పాటు ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో ఉన్న అనేక గ్రామాల నుంచి కూడా ప్రజలను కొండకు రప్పించారు. వారు నివాసం ఉండటానికి మఠం భూమిని లీజుకు ఇచ్చారు. మఠంలోను, ఆలయంలోను ఉద్యోగాలు ఇచ్చి జీవనోపాధి చూపించారు. దీంతో ఆలయం చుట్టూ నాలుగు మాడ వీధుల్లో ఒక ఊరు ఏర్పడింది. ఆ ఊరి జనాభా అప్పట్లో 300 లోపే. తిరుమలకు వచ్చే యాత్రికులకు ఈ కుటుంబాలే వసతి, భోజన ఏర్పాట్లు చేసేవి. క్రమంగా స్థానిక జనాభా 25 వేలకు చేరుకుంది. రోజూ ఉదయమే మహద్వారం గుండా నేరుగా లోపలికి వెళ్లి వీరు దర్శనం చేసుకుని దిన చర్య మొదలు పెట్టేవారు. భక్తుల భద్రత కోసం అని కొండకు తరలివచ్చిన జనం, ఆ తర్వాత అదే భద్రతకు ఇబ్బంది అని తరలిపోవాల్సి వచ్చింది.





కళారూపాల కనువిందు



శుక్రవారం రాత్రి 9 నుంచి 11 గంటల వరకు జరిగిన పెద్దశేషవాహన సేవలో కళా బృందాల ప్రదర్శనలు కనువిందు చేశాయి. టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన 14 కళాబృందాల ద్వారా 410 మంది కళాకారులు ప్రదర్శనలిచ్చారు. ఒడిస్సీ నృత్యం, మయూరి నృత్యం, యక్షగానం, వీరగాశ, కోలాటాలు, ఒగ్గుడోలు, మోహినీయట్టం, గొంబె నృత్యం వంటి ప్రదర్శనలు గ్యాలరీల్లోని భక్తులు విశేషంగా ఆకట్టుకున్నాయి.



నూతన డైరీలు, క్యాలెండర్ల ఆవిష్కరణ



శుక్రవారం రాత్రి స్వామి దర్శనం అనంతరం సీఎం చంద్రబాబు ఆలయంలోని రంగనాయకమండపంలో టీటీడీ ముద్రించిన 2025 నూతన సంవత్సర డైరీలు, క్యాలెండర్లు ఆవిష్కరించారు. 12 పేజీల క్యాలెండర్లు 13.50 లక్షలు, పెద్దడైరీలు 8.25 లక్షలు, చిన్నడైరీలు 1.50 లక్షలు, టేబుల్‌టాప్ క్యాలెండర్లు 1.25 లక్షలు, శ్రీవారిపెద్ద క్యాలెండర్లు 3.5 లక్షలు, శ్రీపద్మావతి అమ్మవారి పెద్ద క్యాలెండర్లు 10 వేలు, శ్రీవారు-శ్రీపద్మావతి అమ్మవారు క్యాలెండర్లు 3 లక్షలు, 6 షీట్ క్యాలెండర్లు 50 వేలు, టీటీడీ స్థానిక ఆలయాలు 10 వేలు, తెలుగు పంచాంగం క్యాలెండర్లు 2.50 లక్షల కాపీలను టీటీడీ ముద్రించింది. ఇవి శనివారం నుంచి తిరుమల, తిరుపతిలో అందుబాటులో ఉంటాయి. అక్టోబరు రెండో వారం నుంచి ఇతర ప్రాంతాల్లో భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

సీఎంకు ఘన స్వాగతం

రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి సీఎం చంద్రబాబు నాయుడు దంపతులు శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. తొలుత తిరుమలలోని పద్మావతి అతిథిగృహానికి చేరుకున్న సీఎంకు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. రాత్రి 7.50 గంటలకు బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకున్న సీఎం.. సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలను తీసుకెళ్లి ఆలయంలో అందజేశారు. 8.55 గంటలకు ఆలయం ముందున్న వాహన మండపానికి చేరుకుని పెద్దశేషవాహనంపై ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. సీఎంతో పాటు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, అమరనాథరెడ్డి, భానుప్రకాష్, ప్రశాంతిరెడ్డి, మురళిమోహన్, నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ పనబాకలక్ష్మి, సుగుణమ్మ, గౌనివారి శ్రీనివాసులు, నేతలు నరసింహయాదవ్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో సేవలు అందించండి

- శ్రీవారి సేవకులకు టీటీడీ ఈవో శ్యామలరావు సూచన



తిరుమల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి భక్తుడిలో శ్రీవారిని దర్శిస్తూ అత్యంత భక్తిశ్రద్ధలతో, అంకితభావంతో, క్రమశిక్షణతో ఉత్తమమైన సేవలు అందించాలని శ్రీవారి సేవకులకు టీటీడీ ఈవో శ్యామలరావు సూచించారు. తిరుమలలోని ఆస్థానమండపంలో శుక్రవారం శ్రీవారి సేవకులతో ఆయన సమావేశమయ్యారు. వార్షిక బ్రహ్మోత్సవాలలో సేవలందించేందుకు దాదాపు 4 వేల మంది శ్రీవారి సేవకులను టీటీడీ ఆహ్వానించిందన్నారు. భక్తులకు శ్రీవారిసేవకులు అందిస్తున్న సేవలు, ప్రత్యేకంగా అన్నప్రసాదం, తాగునీరు, లడ్డూ ప్రసాదాల పంపిణీ, శ్రీవారి ఆలయం, కల్యాణకట్ట, బయటప్రదేశాల్లోని క్యూలైన్ల నిర్వహణ, ఇతర కార్యక్రమాల్లో శ్రీవారి సేవకుల సేవలను కొనియాడారు. శ్రీవారి సేవకుల నిస్వార్థమైన సేవలకు గుర్తింపుగా సుపథం ద్వారా దర్శన సౌకర్యాన్ని ఇటీవల పునరుద్ధరించామని అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. సీపీఆర్వో రవి, పీఆర్వో నీలిమ, శ్రీవారిసేవ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

అలరించిన ఈల పాట



సభ ప్రారంభంలో ప్రముక విజిల్ ఆర్టిస్ట్, బాపట్లకు చెందిన శివప్రసాద్ ప్రత్యేక సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. గంటలకు పైగా అన్నమాచార్య సంకీర్తనలు, భజనలను విజిల్ ద్వారా ఆలపించారు. గత 45 ఏళ్లలో 30కిపైగా దేశాల్లో 16 వేలకుపైగా ప్రదర్శనలు ఇచ్చిన ఈయన్ను టీటీడీ అధికారులు అభినందించారు.

ప్రదర్శనశాలల ప్రారంభం



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న టీటీడీ అధికారులు

తిరుమలలోని కల్యాణవేదిక వద్ద ఏర్పాటు చేసిన ఫలపుష్ప, అటవీ, శిల్ప, ఫొటో ప్రదర్శనశాలలను టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి శుక్రవారం ప్రారంభించారు. ప్రవేశ మార్గంలో ఉంచిన దుర్యోధన పరాభవం, అటవీశాఖ ఏర్పాటు చేసిన శేషాచల శ్రేణుల సెట్టింగ్, టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవేంకటేశ్వర సాంప్రదాయ శిల్పకళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన చెక్క, సిమెంట్, లోహ శిల్పాలను సందర్శించారు. తర్వాత నాడు-నేడు కాన్సెప్ట్‌తో టీటీడీ ప్రజాసంబంధాల విభాగం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. తిరుమల దేవాలయం, ఇతర ముఖ్యమైన అంశాలకు సంబంధించిన అరుదైన ఫొటోల సేకరణ, ప్రస్తుతం తిరుమల అభివృద్ధికి చెందిన తీరును తెలిపే చిత్రాలు ఉన్నాయి. ఈకార్యక్రమంలో జేఈవో గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, ఉద్యానవనం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఫారెస్ట్ డిప్యూటీ కన్జర్వేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలను చూస్తున్న భక్తులు

విమాన ప్రయాణికులకో స్క్రీన్



రేణిగుంట, అక్టోబరు 4: విమానాశ్రయంలో ప్రత్యేక ఎల్‌ఈడీ స్క్రీన్‌ను టీటీడీ ఏర్పాటు చేసింది. రేణిగుంట విమానాశ్రయానికి రాకపోకలు సాగించే ప్రయాణికులు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, వాహనసేవలను వీక్షించేందుకు వీలుగా శుక్రవారం భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు.

తొలి ప్రయాణికులకు సన్మానం

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 4: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తొలిరోజైన శుక్రవారం వేకువజామున సీబీఎస్, రైల్వేస్టేషన్, అలిపిరి, తిరుమల ఆర్టీసీ బస్టాండ్ల నుంచి తొలుత బస్సు ఎక్కిన ప్రయాణికులను వస్త్ర బహుమానంతో ఆర్టీసీ సన్మానించింది. అలాగే, తిరుపతి, తిరుమల ఆర్టీసీ బస్టాండ్లను సర్వాంగసుందరంగా అలంకరణలు చేపట్టారు. తొలిగా బయల్దేరే బస్సులను కూడా ముస్తాబుచేశారు. అర్ధరాత్రి తర్వాత ఒంటి గంటకు బస్సులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం బస్సు వద్దకు వచ్చిన దంపతులకు వస్త్రాలతోపాటు పూలమాలలతో సత్కరించారు. వారిద్వారా జెండా ఊపి బ్రహ్మోత్సవాలలో ఘాట్ బస్సుల ప్రయాణాన్ని ఆరంభించారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీటీఎం భాస్కర్, ఏటీఎం డి.రామచంద్ర నాయుడు, అధికారులు బాలాజీ, హరిబాబు, విశ్వనాథం, భాస్కర్, పుష్పలత, యూనియన్ నాయకుడు తాడాయం సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాలాజీ బస్టాండులో తొలిగా బస్సుఎక్కిన ప్రయాణికులకు వస్త్రబహుమానం ఇస్తున్న ఆర్టీసీ అధికారులు



శుక్రవారం రాత్రి పెద్ద శేషవాహనంపై మలయప్ప స్వామిని దర్శించుకుంటున్న భక్తులు





పుత్తూరు వార్తలు

సీఎంకు ఎమ్మెల్యే ఘనస్వాగతం



పుత్తూరు అర్బన్, అక్టోబర్ 4: తిరుమల బ్రహ్మోత్సవాల్లో శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించడానికి విచ్చేసిన సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఘనస్వాగతం పలికారు. శుక్రవారం తిరుపతి విమానాశ్రయంలో సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉద్యోగుల బాధ్యతల స్వీకరణ

వడమాలపేట, అక్టోబర్ 4: ఉద్యోగుల బదలీ నేపథ్యంలో శుక్రవారం వడమాలపేట మండలానికి వచ్చిన అధికారులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోగా శేషగిరిరావు, సూపరింటెండెంట్‌గా హరినాథ్ బాబు, సీనియర్ అసిస్టెంట్‌గా విజయకుమార్, పంచాయతీ రాజ్ ఏఈగా నాగేంద్ర శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అలాగే డీటీగా సుధీర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానీబాషా, వీఆర్వోలు బాధ్యతలు స్వీకరించారు.

గాయత్రిగా నాగాలమ్మ



గాయత్రి అలంకరణలో నాగాలమ్మ - గజలక్ష్మిగా ద్రౌపదిదేవి

పుత్తూరు/ వడమాలపేట/ పుత్తూరు టౌన్, అక్టోబరు 4: దేవీ నవరాత్రుల సందర్భంగా రైల్వే క్వార్టర్స్‌లో కొలువై ఉన్న నాగాలమ్మ ఆలయంలో అమ్మవారు శుక్రవారం గాయత్రిదేవి రూపంలో భక్తులను కటాక్షించారు. ఉభయదారులుగా కృష్ణకుమారి కుటుంబం వ్యవహరించింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వడమాలపేటలోని వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి రూపంలో దర్శనమిచ్చారు. పుత్తూరు పట్టణంలోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో అమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా పట్టణానికి చెందిన సత్యనారాయణ దంపతులు వ్యవహరించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ క్రిష్టప్ప మెదలి, సభ్యులు మునిచంద్ర, దామోదరం తదితరులు పాల్గొన్నారు. అలాగే పుత్తూరు మండల పరిధిలోని రాచపాలెంలో కొలువై ఉన్న లక్ష్మీకనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరిగా భక్తులను కటాక్షించారు. ఉభయ దారులుగా ప్రతాపరాజు, బాలసుబ్రమణ్యం రాజు, జయరామరాజు కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

ప్రభుత్వమే ఇసుక సరఫరా చేయాలి: సీపీఎం

పుత్తూరు టౌన్, అక్టోబర్ 4: ప్రభుత్వమే ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేష్ కోరారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఇసుక ఉచితంగా సరఫరా చేయాలంటూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులవుతున్నా ఇసుక పంపిణీపై సరైన నిర్ణయం లేదన్నారు. ఇసుక లేకపోవడంతో చాలామంది నిర్మాణాలు నిలిపివేయడంతో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక రోడ్డున పడ్డారన్నారు. శివకుమార్, మోసస్, భవన నిర్మాణ నాయకులు శేఖర్, నవీన్‌కుమార్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ గ్రామాల్లో కానరాని శ్మశానాలు

పుత్తూరు టౌన్, అక్టోబర్ 4: ఎస్సీ, ఎస్టీ, బీసీలు అత్యధికంగా నివసించే గ్రామాల్లో శ్మశాన వాటికలు లేకపోవడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వేణుగోపాలపురం సాగర్ ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు నీరందించాలని కోరారు. టిడ్కో ఇళ్లను ఇప్పటివరకు లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు.

ఎంబీయూలో అట్టహాసంగా మోహన మంత్ర



వేదికపై మంచు విష్ణు తదితరులు

చంద్రగిరి, అక్టోబరు 4: మండలంలోని ఎ.రంగంపేట సమీపంలో గల మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో మోహన మంత్ర కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ఎంబీయూ ప్రొ.ఛాన్సలర్ విష్ణు మంచు ప్రారంభించారు. ఛాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు హాజరయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 20 వేలమందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు. మంచు విష్ణు మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని, వారి మేధస్సును, నైపుణ్యాన్ని వెలికితీయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. టెక్నోహాలిక్, కళాక్షేత్ర, స్పోర్ట్స్ ఈవెంట్స్‌లో విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. విద్యార్థులతో కలిసి మంచు విష్ణు డ్యాన్సు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్‌మహేశ్వరి, వైస్ ఛాన్సలర్ ఆచార్య నాగరాజ రామరావ్, చీఫ్ గ్రోత్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథి, డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ఆధ్వర్యంలో నేటమ్స్ షుగర్ ఫ్యాక్టరీ రైతులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబుకు పరిస్థితులను వివరించి వినతిపత్రం ఇస్తున్న శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు రెడ్డివారి చక్రపాణి రెడ్డి

ప్రతిఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అశోక రాజు

నారాయణవనం, అక్టోబర్ 4: ప్రతి ఒక్కరు సనాతన ధర్మాన్ని పాటించాలని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోకరాజు పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు సనాతన ధర్మంపై అవగాహన కల్పించారు. తమ కళాశాల నిర్మాణం పద్మావతి, కల్యాణ వెంకన్న నడయాడిన ప్రదేశంలో జరిగిందన్నారు. ఇటీవల తిరుమల లడ్డూ వివాదం త ది తరాలను తట్టుకోలేకే సనాతన ధర్మంపై అవగాహన కల్పించాలని నిర్ణయించినట్టు తెలిపారు. భారతదేశం వసుధైక కుటుంబమని, సంప్రదాయాలను, సనాతన ధర్మాలను యావత్తూ ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చాలని కేంద్రప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. ప్రాథమిక విద్య నుంచే సనాతన ధర్మాన్ని పాటించాలని కోరారు. తల్లిదండ్రుల పట్ల, గురువుల పట్ల భక్తిభావం కలిగేలా విద్యార్థి దశ నుంచే నేర్పించే విధంగా చొరవ తీసుకుంటామన్నారు. పార్టీలకతీతంగా, కులమతాలకతీతంగా సనాతన ధర్మాన్ని ప్రతి భారతీయుడు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన రాజు, రమేష్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌడ సంఘ అధ్యక్షుడిగా రమేష్



రమేష్‌బాబు గౌడ్‌ను సన్మానిస్తున్న విజయకుమార్ తదితరులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 4: నియోజకవర్గ గౌడసంఘ అధ్యక్షుడిగా అంతటి రమేష్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని తహసీల్దారుకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆశీస్సులతో తనకు ఈ పదవి లభించిందన్నారు. నియోజకవర్గంలోని గౌడ కులస్థులకు తహసీల్దారు నుంచి కుల ధృవీకరణ పత్రాలు తీసిస్తానన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు కంఠా రమేష్, దొరబాబుగౌడ్, మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డీటీ బాధ్యతల స్వీకరణ

వరదయ్యపాళెం, అక్టోబరు 4: వరదయ్యపాళెం మండల డిప్యూటీ తహసీల్దారుగా వెంటకసుబ్బయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన ఆర్ఐగా ఇక్కడే పనిచేశారు. పదోన్నతిలో భాగంగా వెంకటసుబ్బయ్య డిప్యూటీ తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టారు.

రసీదు ఇవ్వకుండా గేటు వసూలు

రేణిగుంట, అక్టోబరు 4: రసీదులు దినసరి కూరగాయల మార్కెట్, పార్కింగ్, వారపు సంతలో రసీదులు ఇవ్వకుండా ఒక్కో దుకాణం వద్ద రూ.300 పైచిలుకు వసూలు చేస్తున్నారని కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ధ్వజమెత్తాయి. రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నాగేశం అధ్యక్షతన జరిగిన గ్రామసభలో పంచాయతీలో ఆరు నెలలుగా వేలం నిర్వహించకుండా ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారంటూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రావణ సభ దృష్టికి తీసుకువచ్చారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ... బోరు కబ్జా విచారణ ఎంతవరకు వచ్చిందని ప్రశ్నించారు. పగటిపూట భారీ వాహనాలు పట్టణంలోని ఇరుకు సందుల్లో వస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొనారు.

రేణిగుంట డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



డీఎస్పీ శ్రీనివాసరావు

రేణిగుంట, అక్టోబరు 4: రేణిగుంట డీఎస్పీగా శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం డీఎస్పీలను బదిలీ చేయడంతో ఇక్కడ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న వెంకటాద్రి అడిషనల్ ఎస్పీగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. కాగా మంగళగిరి హెడ్‌క్వార్టర్స్‌లో సీఐడీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు రేణిగుంట డీఎస్పీగా బదిలీ అయ్యి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

విద్యుత్ తీగలు తెగిపడి ఒకరి మృతి



సంపత్ (ఫైల్‌ఫొటో)

సత్యవేడు, అక్టోబరు 4: విద్యుత్ తీగలు తెగిపడి యువకుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... పట్టణంలో గురువారం రాత్రి పెనుగాలులు వీచాయి. ఆ గాలులకు కోమటిగుంట ప్రాంతంలో నివాసం ఉంటున్న జమాల్ అలియాస్ సంపత్(36) ఇంటి ఆవరణలో విద్యుత్ తీగలు తెగి ప్రహరీపై పడ్డాయి. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో సంపత్ ఇంటి నుంచి వెలుపలికి రాగా తీగలు తగిలి కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయన్ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు నిర్ధరించారు. సంపత్ మృతికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబీకులు శుక్రవారం ఉదయం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పోలీసులు సర్దుబాటు చేశారు.

ఆస్పత్రి భవనం ప్రారంభం

ఏర్పేడు, అక్టోబరు 4: మండల కేంద్రంలోని డేవిడ్ రీస్ ఆస్పత్రిలోని ఓ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఆస్పత్రికి బొజ్జల కుటుంబ చేసిన సేవలకు గాను ఆ భవనానికి బొజ్జల భవనంగా నామకరణం చేశారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి వై.ప్రవీణ్, డాక్టర్ శంకర్ ప్రసాద్ రెడ్డి, ఫౌండర్ మెంబర్ బైకిరెడ్డి, ఆస్పత్రి డైరెక్టర్ ఎంఈస్, డాక్టర్ స్వాతి, ప్రతాప్‌నాయుడు, విన్సెంట్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల సమస్య పరిష్కార శిబిరం

రేణిగుంట, అక్టోబరు 4: రైల్వే ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక క్యాంపును రైల్వే కల్యాణమండపంలో నిర్వహించారు. రైల్వే డివిజన్ పర్సన్ ఆఫీసు సిబ్బంది, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ చెంచురెడ్డి వినతులను స్వీకరించారు.

8న మెగాజాబ్ మేళా

సత్యవేడు, అక్టోబరు 4: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈనెల 8న మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఉషాదేవి పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో శ్రీసిటీలోని పలు బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, బీటెక్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీయువకులు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకురావాలని కోరారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

భూములను కాపాడండి

కేవీబీపురం, అక్టోబరు 4: మండలం కేంద్రంలో తమ భూములు కాపాడాలంటూ గిరిజన కాలనీకి వాసులు సీపీఐ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. కాట్రపల్లి రెవెన్యూ సర్వే నెం. 2012, 2013లలో 6.10ఎకరాల ప్రభుత్వ భూమి గత 40 సంవత్సరాలుగా తమ అధీనంలో ఉందని అయితే కొందరు ఎక్స్‌కవేటర్లతో చదును చేస్తున్నారన్నారు. సీపీఐ నాయకులు శ్రీరాములు, జిల్లా కార్యదర్శి మురళి భూములను పరిశీలించి గిరిజనులకు న్యాయం జరిగేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

ఉచిత ఇసుక అమలు చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 4: ఉచిత ఇసుకను అమలు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి జనార్దన్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఉచిత ఇసుక అమలు చేయలేదన్నారు. ఇసుక రవాణా చార్జీలు పేరుతో ప్రభుత్వం అధిక మొత్తం విధించడం భావ్యం కాదన్నారు. అనంతరం తహసీల్దార్ సుబ్రమణ్యంకు వినతిపత్రం అందజేశారు.

ఎంపీడీవోగా బాలాజీ నాయక్

నాగలాపురం, అక్టోబరు 4: నాగలాపురం మండల ఎంపీడీవోగా బాలజీ నాయక్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన బాబు కడప జిల్లాకు బదిలీపై వెళ్లడంతో చంద్రగిరి ఎంపీడీవోగా పనిచేస్తున్న బాలాజీనాయక్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే డీటీగా లావణ్య శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గత కొన్ని నెలలుగా నాగలాపురం డీటీ స్థానం ఖాళీగా ఉండడంతో తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న లావణ్య బదిలీపై వచ్చారు.

డయాలసిస్ పేషెంట్‌కి పింఛన్ అందజేత

పిచ్చాటూరు, అక్టోబరు 4: పట్టణానికి చెందిన గజ డయాలసిస్ చికిత్స పొందుతున్నాడు. ఈ నెల పింఛన్లు అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త సఫియా తిరుపతికి తన సొంత ఖర్చులతో వెళ్లి తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న గజాకు పింఛను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సాయికుమార్ (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, అక్టోబరు 4: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డికండ్రిగ అరుంధతివాడకు చెందిన సాయికుమార్ గురువారం రాత్రి శ్రీకాళహస్తిలోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మిట్టకండ్రిగ వద్ద పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిపై ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో సాయికుమార్ తీవ్రంగా గాయపడగా స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయాకు తరలిస్తుండగా మృతి చెందాడు. శ్రీకాళహస్తి 1టౌన్ పోలీసులు మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. శుక్రవారం కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అపగించారు.

స్నానఘట్టంలో అదుపు తప్పి క్షురకుడి మృతి

శ్రీకాళహస్తి, అక్టోబరు 4: స్నానఘట్టంలో అదుపు తప్పి స్వర్ణముఖి నదిలో నీట మునగడంతో ఓ క్షురకుడు మృతి చెందాడు. కార్వేటినగరానికి చెందిన చంద్రశేఖర్ అదే పట్టణంలో సెలూన్ నిర్వహిస్తున్నాడు. శ్రీకాళహస్తి దర్గామిట్టలో ఉన్న బంధువుల ఇంటికి కుటుంబ సమేతంగా శుక్రవారం వచ్చాడు. ముక్కంటిని దర్శించుకునే ముందు సన్నిధివీధిలో ఉన్న స్నానఘట్టంలో స్నానం చేసేందుకు దిగాడు. అదుపు తప్పి లోతుకు వెళ్లిపోవడంతో మృతి చెందాడు. స్థానికులు గుర్తించి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. శ్రీకాళహస్తి 1టౌన్ పోలీసులు మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

స్కిట్‌కు పూర్వవైభవం: ఎమ్మెల్యే సుధీర్



అధికారులతో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబరు 4: స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు పూర్వవైభవం తీసుకువస్తానని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా స్థాపించిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను అనంతపురం జేఎన్‌టీయూలో విలీనం చేసే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని నియమించిన విషయం తెలిసిందే. శుక్రవారం కమిటీ బృందం, ఎమ్మెల్యే స్కిట్ కళాశాలను పరిశీలించారు. స్కిట్ కళాశాలలోని సిబ్బంది, కళాశాల భవన తరగతి గదులు, ల్యాబ్‌లు, పరికారలు, విస్తీర్ణం, కళాశాల కితం విద్యాసంవత్సరాల గణాంకాలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ స్కిట్ కళాశాలను తన తండ్రి, దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నెలకొల్పారని చెప్పారు. గత వైసీపీ పాలకులు స్థానిక విద్యార్థులకు కళాశాలను దూరం చేసి మూత వేయడం బాధాకరమన్నారు. ఎన్నికల సందర్భంగా స్కిట్ కళాశాలకు పూర్వవైభవం తెస్తానని తాను హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఈ మేరకు మూడు నెలల్లోనే కళాశాలను జేఎన్‌టీయూలో విలీనం చేసేందుకు కమిటీని నియమించేలా కృషి చేశానన్నారు. గతంలో స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల రాష్ట్రంలో ఆదర్శ విద్యా సంస్థగా ప్రఖ్యాతి చెందిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి స్కిట్ కళాశాలలో తరగతులను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ వైస్‌చైర్మన్ రామ్మోహన్‌రావు, సెక్రటరీ నజీర్ అహ్మద్, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య, మాజీ వీసీ రంగా జనార్దన్, స్కిట్ ప్రిన్సిపాల్ దేవేందర్‌రెడ్డి, టీడీపీ నాయకులు, ముక్కంటి ఆలయ డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరుణించు తల్లీ.. కల్పవల్లి



బ్రహ్మచారిణిగా జ్ఞానప్రసూనాంబ - కామాక్షిగా మరగదాంబిక - బాలత్రిపురసుందరిగా గుడిమల్లం పార్వతీదేవి , అవనాక్షమ్మ

శ్రీకాళహస్తి, అక్టోబరు 4: కరుణించు తల్లీ కల్పవల్లి అంటూ భక్తులు ప్రణమిల్లారు. దసరా ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం వివిధ రూపాల్లో ఆయా ఆలయాల్లో కొలువైన అమ్మవార్లు భక్తులను కటాక్షించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబిక ఉత్సవమూర్తిని మహావిష్ణువుగా అలంకరించారు. అలాగే ఆలయంలో బొమ్మల కొలువు ఉత్సవమూర్తి బ్రహ్మచారిణిగా దర్శనమిచ్చారు. ఇదే ఆలయంలో కనకదుర్గమ్మ, ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై ఉన్న కనకదుర్గమ్మను, ముత్యాలమ్మను ప్రత్యేకంగా అలంకరించారు.

కామాక్షి అలంకరణలో మరగదాంబిక

నాగలాపురం/ నారాయణవనం/ వరదయ్యపాళెం: సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మరగదాంబిక అమ్మవారు కంచి కామాక్షి అలంకరణలో భక్తులను కటాక్షించారు. నారాయణవనం మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ ఆలయమైన అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. అలాగే అమ్మవారిని ఆలయ ప్రాంగణంలో తిరుచ్చి వాహనంపై ఊరేగించారు. వరదయ్యపాళెం మండల కేంద్రంలో వెలసిన చెంగాలమ్మ ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

గుడిమల్లంలో వేడుకగా కంకుమార్చన

ఏర్పేడు: దేవీ నవరాత్రుల్లో భాగంగా గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలో కుంకుమార్చన జరిగింది. పార్వతిదేవి బాలత్రిపురసుందరిగా భక్తులకు కటాక్షించారు. ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఇక గుడిమల్లం ఆలయ అన్నదాన భవన నిర్మాణానికి బెంగళూరుకు చెందిన మీనాక్షి, ఎర్రప్పరెడ్డి దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. చిందేపల్లిలో వెలసిన సిద్దేశ్వరాయలంలో పార్వతీదేవి బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

చెరువు మట్టి అక్రమ తరలింపు



చెరువలో మట్టి తవ్వకాలు

రేణిగుంట, అక్టోబరు 4: చెరువు మట్టిని అనుమతులు లేకుండా ఓ ప్రైవేటు వెంచర్‌కు తరలిస్తున్నారు. మండలంలోని జీపాళెం పంచాయతీ కుర్రకాలువ చెరువులో ఎక్స్‌కవేటర్ల సాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా వెంచర్‌కు తరలిస్తున్నారు. ఈ విషయంపై మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌ను ప్రశ్నించగా టీడీపీ మండల నాయకుడు ఆదేశాలతో స్థానిక వైసీపీ మాజీ సర్పంచ్ కుమారుడు వెంచర్‌కు మట్టి తరలిస్తున్నారని చెప్పడం గమనార్హం. ఈ విషయంపై వీఆర్వో శంకర్‌ను వివరణ కోగా చెరువులో మట్టిని తరలిస్తున్నారనే సమాచారం తమకు అందలేదని వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

మళ్లీ మొదటికొచ్చిన చిందేపల్లి రోడ్డు సమస్య

ప్రత్యామ్నాయ రోడ్డును ఆక్రమించిన ఈసీఎల్ యాజమాన్యం



ధర్నా చేస్తున్న చిందేపల్లివాసులు

ఏర్పేడు, అక్టోబరు 4: మండలంలోని చిందేపల్లికి పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారికి కలుపుకుని పోయే ఆర్‌అండ్‌బీ రోడ్డు గత వైసీపీ ప్రభుత్వంలో ఈసీఎల్ పరిశ్రమ యాజమాన్యం దౌర్జన్యంగా కబ్జా చేసిన విషయం తెలిసిందే. అయితే రైల్వేట్రాక్ నుంచి జగనన్న కాలనీ మీదుగా ఊరందరూ గ్రామానికి వెళ్లే వరవ కాలువలను పూడ్చి ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే ఆ రోడ్డును శుక్రవారం ఈసీఎల్ యాజమాన్యం ఆక్రమించుకునేందుకు యత్నించింది. రోడ్డుపై గేటును ఏర్పాటు సెక్యూరిటీ సిబ్బందిని పెట్టి చిందేపల్లికి వెళ్లేవారిని అడ్డుకుంది. దీంతో గ్రామస్తులు పరిశ్రమ ఎదుట ధర్నాకు దిగారు. అధికారులు స్పందించి ఈసీఎల్ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సీఎంకు సాదర స్వాగతం





శ్రీకాళహస్తి/ రేణిగుంట, అక్టోబరు 4: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం తరఫున సారె సమర్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం తిరుపతి విమానాశ్రయానికి విచ్చేశారు. ఆయనకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అదే విధంగా జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత కూడా సీఎంకు స్వాగతం పలికారు.

ముక్కంటి సేవలో జేఎన్‌టీయూ కమిటీ

శ్రీకాళహస్తి, అక్టోబరు 4: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని శుక్రవారం జేఎన్‌టీయూ కమిటీ సభ్యులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

సుప్రీం ఆదేశాలతో ఆత్మరక్షణలో జగన్: టీడీపీ

శ్రీకాళహస్తి, అక్టోబరు 4: తిరుమల శ్రీవారి లడ్డూ వివాదంలో సుప్రీం తీర్పుతో మాజీ సీఎం జగన్ బృందం ఆత్మరక్షణలో పడిందని టీడీపీ బీసీ సెల్ నాయకులు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ తిరుమల మొత్తాన్ని ధర్మారెడ్డి, సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి చేతిలో పెట్టి అపవిత్రం చేశారన్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టుకు వెళ్లిన వైవీ సుబ్బారెడ్డిని రాజకీయాలు చేయవద్దని హెచ్చరించదన్నారు. సిట్ ఏర్పాటుతో జగన్ బృందంతో వణుకు మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో మిన్నల రవి, ఉమేష్‌రావు, ఎన్.బుజ్జి పాల్గొన్నారు.

ప్రియుడి చేతిలో మహిళ హతం



కాటమ్మ (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, అక్టోబరు 4: మద్యం మత్తులో ప్రియుడే ప్రియురాలిని హతమార్చాడు. శ్రీకాళహస్తి మండలం రామలింగాపురం ఎస్టీకాలనీ కి చెందిన కాటమ్మ(40) భర్త మరణించాడు. ఆమెకు పుట్టుకతో మూగ. పొరుగు గ్రామమైన బొక్కిసంపాళెంలో ఓ రైతు వద్ద కూలీగా పని చేసేది. కేవీబీపురం మండలం సూరమాల ఎస్టీ కాలనీకి చెందిన చెంచయ్య(40) బొక్కిసంపాళెంలోని మరో రైతు వద్ద పొలంలో పని చేసేవాడు. మూడు నెలల క్రితం కాటమ్మ, చెంచయ్య మధ్య పరిచయం ఏర్పడింది. పదిరోజుల క్రితం వీరిద్దరు రామలింగాపురంలోని ఓ రైతు ఆవుల దొడ్డిలో సంరక్షకులుగా చేరారు. అప్పటినుంచి సహజీవనం చేస్తున్నారు. ఇంతలో ఏం జరిగిందోకానీ రాత్రి ఆవుల షెడ్ వద్ద చెంచయ్య మద్యం మత్తులో కాటమ్మపై కర్రతో దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలింది. ఉదయం స్థానిక రైతులు కాటమ్మ మృతదేహాన్ని గుర్తించి చెంచయ్యను నిలదీశారు. దీంతో అతను ఘటనా స్థలంనుంచి పరారయ్యాడు. రైతలు శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా కాటమ్మకు వివాహమైన ఇద్దరు కుమార్తెలున్నారు.

అపహరణకు గురైన ఆవు యజమానికి అప్పగింత

ఏర్పేడు, అక్టోబరు 4: మండలం మడిబాక పంచాయతీ రాజుల కండ్రిగలో మూడు రోజుల క్రితం పొలాల్లో మేస్తున్న ఆవు అపహరణకు గురైంది. దీనిపై యజమాని భూపతినాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎండీపుత్తూరు అరుంధతివాడకు చెందిన హరి మూడు రోజుల క్రితం ఆవును తొండమనాడుకు చెందిన శ్రీనివాసులుకు విక్రయించినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. పోలీసులు తొండమనాడుకు చేరుకుని ఆవును గుర్తించి భూపతినాయుడకు అప్పగించారు. హరిపై కేసు నమోదు చేశారు.